
# సాక్షి మంచిర్యాల

శుక్రవారం। 5। జనవరి। 2024




**మరో 12 రోజులు..** 8లో▸

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసినా లెక్కింపు కేంద్రంలో ఎన్నికల సామగ్రి ఇంకా భద్రంగా ఉన్నాయి. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి సీజ్ చేశారు.



**నాగోబా జాతరకు సన్నద్ధం**

కేస్లాపూర్‌లో ఫిబ్రవరి 9న నాగోబా జాతర ప్రారంభం కానుంది. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో చాహత్ బాజ్‌పాయ్ జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
**30.0 /17.0**

**వాతావరణం**

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఆరో రోజు 30,175 దరఖాస్తులు

**మంచిర్యాలఅగ్రికల్చర్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదు గ్యారంటీల అమలులో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గురువారం జిల్లాలో 30,175 దరఖాస్తులు వచ్చాయి. 16 మండలాలు, 7 మున్సిపాలిటీల నుంచి ఇప్పటివరకు మొత్తం 2,25,654 దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణ గత నెల 28 నుంచి ప్రారంభం కాగా రేపటితో ముగియనుంది. రెండు రోజుల్లో దరఖాస్తులు పోటెత్తే అవకాశం ఉంది.

### ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓ సస్పెన్షన్?

**వేమనపల్లి:** కుశ్నపల్లి రేంజ్ పరిధిలోని వేమనపల్లి ఎఫ్ఎస్‌వో రవికుమార్, కళ్లంపల్లి ఎఫ్‌బీవో శ్రీనివాస్‌లు సస్పెండ్ అయినట్లు సమాచారం. రవికుమార్ గతంలో లింగాల ఎఫ్ఎస్ఓగా, శ్రీనివాస్ నాగారం బీట్ అధికారిగా విధులు నిర్వర్తించారు. అక్టోబర్‌లో నాగారం అటవీ ప్రాంతంలో ఓ ప్రైవేటు వాహనంలో టేకు కలప తరలిస్తుండగా సదరు అధికారులు వాహనంతోపాటు డ్రైవర్, మరో వ్యక్తిని పట్టుకున్నారు. డ్రైవర్ పారిపోయాడని అధికారులకు పొంతన లేని సమాచారం ఇచ్చారు. డ్రైవర్‌ను కావాలనే తప్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. అతడి మొబైల్ ఫోన్‌లో సైతం సదరు అధికారుల ఫోన్ నంబర్లు ఉండడంతో ఈ విషయమై అధికారులు లోతుగా విచారణ జరిపారు. పట్టుబడిన ప్రాంతంలో గతంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. విచారణ అనంతరం అక్రమ కలప రవాణాకు సహకరించిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసినట్లు అటవీ అధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విషయమై బెల్లంపల్లి ఎఫ్‌డీఓ వినయ్‌కుమార్ సాహు, కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్‌ల వివరణ కోసం ప్రయత్నించగా స్పందించలేదు.

### గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

**మంచిర్యాలక్రైం:** రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిరంతరం నిఘా వేస్తున్నారని పేర్కొన్నారు. క్రయ, విక్రయాలు, రవాణా, ఇదివరకు గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై నిఘా ఉంచుతామని తెలిపారు. గంజాయి విక్రయించే ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తామని, పాత నేరస్తుల బైండోవర్, కౌన్సెలింగ్ నిర్వహించి గంజాయి వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, ఆరోగ్యం స్థితిగతులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని, స్థానిక పోలీస్ అధికారులు, రామగుండం పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

### ఆర్టీసీలో వనభోజనాలు రద్దు చేయాలి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

**మంచిర్యాలఅర్బన్:** మంచిర్యాల డిపోలో వనభోజనాలు రద్దు చేయాలని పలువురు కార్మికులు డీఎం రవీంద్రనాథ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. వనభోజనాలకు సిబ్బంది సమయం, నిధులు వెచ్చించడం వల్ల సంస్థకు ఖర్చు పెరిగి ఆదాయం తగ్గుతోందని పేర్కొన్నారు. వనభోజనాలు రద్దు చేసి సంస్థ అభివృద్ధికి అవసరమైన సిబ్బందికి బాండ్ డబ్బులు, డీఏ ఏరియర్స్, జీతభత్యాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

### 9నుంచి సదరం వైద్య శిబిరాలు

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 9 నుంచి సదరం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి తెలిపారు. సదరం సర్టిఫికెట్ కాలపరిమితి పూర్తయిన వారు రెన్యువల్ కోసం నూతన సర్టిఫికెట్ పొందడానికి అర్హులని తెలిపారు. దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ నెల 9, 24వ తేదీల్లో శారీరక దివ్యాంగులు 100 మందికి, 12, 22వ తేదీల్లో మూగ చెవుడు 100 మందికి, 19, 31వ తేదీల్లో కంటిచూపు సమస్యలు ఉన్నవారు 60మందికి, 23, 30వ తేదీల్లో మానసిక దివ్యాంగులు 100 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సకాలంలో హాజరై ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మిల్లరే కాంట్రాక్టర్ !

- స్టేజ్–1, లక్సెట్టిపేట స్టేజ్–2 రవాణాకు వారి లారీలే
- నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యం సరఫరా
- అధికారులకు తెలిసినా ప్రతీ నెల బిల్లులకు ఓకే
- 'బియ్యం బస్తాల మాయం'పై ఉన్నతాధికారుల దృష్టి

**సాక్షి ఎఫెక్ట్..**



నస్పూర్ తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యం బస్తాల చోరీపై గురువారం విచారణ

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** పౌరసరఫరాల శాఖలో రేషన్ బియ్యం సరఫరాలో డొల్లతనం బయటపడడంతో రవాణా కాంట్రాక్టరు, అధికారుల్లో కలవరం మొదలైంది. 'బియ్యం బస్తాల మాయం' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో ఈ వ్యవహారమంతా బట్టబయలమైంది. దీంతో హడావుడిగా పోలీసు విచారణకు వెళ్లారు. మొదట ఎత్తుకెళ్లిన బియ్యంను తమ రైస్‌మిల్లుల నుంచే తెచ్చి సర్దుబాటు చేయాలనుకుని విఫలమయ్యారు. సొంత రైస్‌మిల్లులు ఉన్న వ్యక్తులే రేషన్ బియ్యం సరఫరా చేయడమనేది నిబంధనలకు విరుద్ధం. మిల్లర్లు బియ్యం రవాణా చేస్తే అక్రమాలు జరుగుతాయని టెండర్లలోనూ అనుమతి ఇవ్వరు. లక్సెట్టిపేటకు చెందిన ఓ రైస్‌మిల్లర్ అనధికారికంగా స్టేజ్–1, అధికారికంగా స్టేజ్–2 రవాణా కాంట్రాక్టర్‌గా కొనసాగుతున్నారు.

**నెలకు రూ.లక్షల్లో బిల్లులు**

రేషన్ బియ్యం స్టేజ్–1(స్టాక్ గోదాం) నుంచి స్టేజ్–2(మండల స్థాయి పాయింట్ల)కు రవాణా చేసేందుకు రెండేళ్లకోసారి ఆ శాఖ టెండర్లు పిలుస్తోంది. రాష్ట్ర స్థాయిలోనే టెండరు దక్కించుకున్న వారు నిబంధనల మేరకు పని చేయాలి. అయితే ఐదారేళ్లుగా ఒకరే రవాణా చేస్తున్నారు. ఆయనకు పోటీగా మరొకరు టెండరు వేశారు. ఓ మిల్లర్‌కు లారీ ఉన్నా.. మిల్లు నిబంధనతో నేరుగా వేయకుండా వేరే వ్యక్తులతో టెండరు వేయించారు. చివరికి పోటీలో ఉన్న ఇద్దరు పరస్పరం తమ లారీలు రవాణాకు వాడుకోవాలని ఒప్పందానికి వచ్చారు. అధికారికంగా వచ్చిన వ్యక్తితోపాటు లక్సెట్టిపేటకు చెందిన మిల్లర్ సైతం రవాణాకు లారీలు పెడుతున్నారు. సీఎంఆర్(కస్టం మిల్లింగ్ రైస్) ఇచ్చే మిల్లర్లు బియ్యం గోల్‌మాల్ జరిగే అవకాశం ఉండడంతో వారి లారీలను అనుమతించొద్దు. కాంట్రాక్టర్‌కు కొరత ఉంటే లారీ అసోసియేషన్ నుంచి వేరే లారీలకు అవకాశం ఇవ్వొచ్చు. ఇవేమీ పట్టించుకోకుండా ప్రతీ నెల రవాణా చేసినందుకు రూ.లక్షల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. ఒకవేళ కాంట్రాక్టర్ సకాలంలో బియ్యం రవాణా చేయకున్నా, తూకం, నాణ్యత లేకున్నా అధికారులు జరిమానా విధించవచ్చు. ఉదాహరణకు ఒక క్వింటా బియ్యం తక్కువ వస్తే ప్రభుత్వం వెచ్చిస్తున్న ఖర్చుకు మూడింతల జరిమానా విధించవచ్చు. ఇలాంటి పర్యవేక్షణ పట్టించుకోకపోగా, ఎక్కువ కిలోమీటర్లు వచ్చేలా బిల్లులు ఆమోదిస్తూ ప్రతీ నెల రూ.లక్షల్లో పక్కదారి పట్టేలా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ఎట్టకేలకు చోరీపై ఫిర్యాదు**

చోరీకి గురైన బియ్యం బస్తాల మాయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద లోడింగ్‌తో నిలిపి ఉన్న టీఎస్19టీఏ 5198 లారీలో నుంచి 36బియ్యం బస్తాలు చోరీకి గురైనట్లు గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో లారీ డ్రైవర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ఘటన మంగళవారం రాత్రి జరిగితే బుధవారమే తెలిసి మొదట దాచిపెట్టారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టరుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

**ధాన్యం నుంచి బియ్యం దాకా**

మిల్లర్ కమ్ రవాణా కాంట్రాక్టరుగా ఉండి అధికారుల సహకారంతో గత కొంతకాలంగా చాలా వ్యవహారం నడిపిస్తున్నారు. రైతుల ధాన్యం కొనుగోలు నుంచి మిల్లింగ్, రేషన్ పంపిణీ వరకు అన్ని దశల్లోనూ ఉంటున్నారు. లక్సెట్టిపేట పరిధిలో తమ పలుకుబడిని వాడి ప్రతీ సీజన్‌లో ఓ ధాన్యం కొనుగోలు కేంద్రం తమ పరిధిలోనే నిర్వహిస్తున్నారు. ఆ ధాన్యాన్ని తమ మిల్లులకే పంపిస్తున్నారు. ఆ ధాన్యాన్ని మరాడించి, లక్ష్యం కింద ఇచ్చి 'సీఎంఆర్'ను పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తున్నారు. తమ లారీలనే స్టేజ్–1 నుంచి స్టేజ్–2కు పంపుతున్నారు. ఇంకో విషయమేమంటే, లక్సెట్టిపేట స్టేజ్–2 అధికారికంగానే కాంట్రాక్టరుగా ఉన్నారు. అంటే ధాన్యం కొనుగోలు నుంచి డీలర్లకు బియ్యం చేరే వరకు చక్రం తిప్పుతున్నారు. ఇందులో ఎక్కడైనా అక్రమం చేయొచ్చు. ధాన్యం తూకం, బియ్యం పాసింగ్, స్టేజ్–1, 2 రవాణాలో లొసుగులు గమనించి పక్కదారి పట్టించవచ్చు. గత వానాకాలంలో భారీ వర్షంలో రాజీవ్‌నగర్ స్టేజ్ వన్ గోదాం నుంచి లారీ రవాణా చేస్తుండగా బియ్యం తడిసిపోయాయి. ఆ బియ్యాన్ని అక్కడి ఇన్‌చార్జి తీసుకోబోమని చెప్పారు. దీంతో నేరుగా తమ మిల్లు నుంచే ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఆ మేరకు బస్తాలు పంపి సర్దుబాటు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఘటనలోనూ తమ మిల్లు నుంచే చోరీకి గురైన బియ్యం బస్తాలు తెచ్చేందుకు అధికారులు మొదట ఓకే అన్నారు. ఎందుకంటే విచారణ, చర్యలు లేకుండా కాంట్రాక్టరు, మిల్లర్ పాత్ర బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. ఇలాంటివి పౌర సరఫరాల శాఖలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారి దృష్టి సారిస్తే మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### అర్హులు ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**బెల్లంపల్లిరూరల్:** ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని చాకేపల్లి గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో మాట్లాడారు. దరఖాస్తు పత్రంతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ విధిగా జత చేయాలని తెలిపారు. దరఖాస్తుదారుల సందేహాలను అధికారులు నివృత్తి చేస్తూ దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. చదువులో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి సీహెచ్.దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, ఎంపీటీసీ మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

**పాఠశాలల సందర్శన**

**నెన్నెల:** మండలంలోని గుండ్లసోమారంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిత్తాపూర్‌లో బాలికల ఆశ్రమ పాఠశాలలను కలెక్టర్ సంతోష్ గురువారం సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా, సిలబస్ పూర్తయిందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గుండ్లసోమారం ఉన్నత పాఠశాలలో గణితం, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టు టీచర్ లేరని హెచ్ఎం బానేష్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా డెప్యూటేషన్‌పై సర్దుబాటు చేయాలని ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. గుండ్లసోమారంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ తనిఖీ చేశారు. ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ వరలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

# రహ'దారి మారింది'..!



భూ సేకరణలో భాగంగా ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ అధికారుల మార్కింగ్ పర్యవేక్షణ

- ఆందోళనలతో ఆగిన మంచిర్యాల – ఆర్మూర్ రోడ్డు మ్యాప్
- తాజాగా గోదావరి తీరం వెంట నాలుగు వరుసల రహదారి
- భూ సేకరణ కోసం ఇప్పటికే కలెక్టర్‌కు ఆదేశాలు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి–63 విస్తరణ పనుల అలైన్‌మెంటు మారింది. తాజాగా ఎన్‌హెచ్ఏఐ నుంచి భూముల నోటిఫై కోసం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చాయి. గతంలో రోడ్డు విస్తరణకు సంబంధించి మూడు అలైన్‌మెంట్లు జరుగగా ఒక అలైన్‌మెంటు ఖరారు చేస్తూ సర్వే చేపట్టారు. ఈ సర్వేపై నిర్వాసితుల అభ్యంతరాలు, వినతుల వెల్లువతోపాటు వివిధ ఆటంకాల నేపథ్యంలో విస్తరణ పనులకు మోక్షం లభించలేదు. భూ సేకరణలో ఇబ్బందుల దృష్ట్యా రహదారి విస్తరణ ప్రణాళిక మార్చాలని అధికారులు భావించి మళ్లీ సిద్ధం చేశారు. తాజా ప్రతిపాదన మేరకు గూడెం నుంచి ప్రభుత్వ భూముల మీదుగా మోదెల నుంచి గోదావరి నదికి సమాంతరంగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో గోదావరి తీరానికి దాదాపు 800 మీటర్ల దూరం నుంచి సాగుతూ ముల్కల్ల గోదావరి తీరం ప్రాంతంలోని ప్రభుత్వ భూములను రోడ్డు నిర్మాణానికి గుర్తించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్లకు జాతీయ రహదారుల సాధికారిక సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ లేఖలు రాయడంతో మళ్లీ రోడ్డు విస్తరణ ప్లాన్ మారిందనే చర్చ మొదలైంది. కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చిన వెంటనే ఆర్డీవో ద్వారా హాజీపూర్, లక్సెట్టిపేట తహసీల్దార్లకు సర్వే కోసం ఆదేశాలు జారీ చేశారు.

**బాధితుల ఆందోళనతోనే..**

రహదారి–63 విస్తరణ పనుల సర్వే, మార్కింగ్ పనులపై నిర్వాసితుల ఆందోళనలు వెల్లువెత్తాయి. రోజుల తరబడి నిరసనలు చేపట్టడంతోపాటు జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. క్యాతనపల్లి–గద్దెరాగడి నుంచి ముల్కల్ల వరకు సర్వే చేసి మార్కింగ్ చేయగా ముల్కల్ల నుంచి గూడెం వరకు భూ సేకరణ పనులు ఆగడంతో ఇప్పుడు మళ్లీ సర్వేకు మోక్షం లభించింది. పాత అలైన్‌మెంట్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో ఎలాంటి నష్టం వాటిల్లకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టేలా మ్యాప్ చేశారు. ఈ కారణంగా నివాస గృహాలు, దుకాణాలు, విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఉండడం బాధితులు పలుమార్లు ఆందోళన చేపట్టారు. సర్వే అధికారులను అడ్డుకుని టెంట్లు వేసుకుని నిరసన తెలిపారు. ఇప్పుడు అలైన్‌మెంట్ మారి గోదావరి తీర ప్రాంతం వెంట నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం చేపట్టే అవకాశాలు ఉండడంతో బాధితులకు ఊరట లభించింది.

**పనుల పర్యవేక్షణ**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి–63 పెగ్ మార్కింగ్ ప్రాంతాలను ఎన్‌హెచ్ఏఐ, రెవెన్యూ అధికారులు గురువారం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. క్యాతనపల్లి నుంచి వేంపల్లి, పోచంపాడు, ముల్కల్ల శివారు వరకు చేసిన రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి పెగ్ మార్కింగ్ పనులు గతంలో పూర్తి చేశారు. ఈ మార్కింగ్‌పై తాజాగా ఎన్‌హెచ్ఏఐ భూ సేకరణ తహసీల్దార్ సత్యనారాయణ, సర్వే ఇంజినీర్ బస్వరాజ్, హాజీపూర్ మండల సర్వేయర్ కృష్ణప్రియ ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరిపారు. పెగ్ మార్కింగ్ అంతటా కూడా స్పష్టంగా ఉండడంతో శుక్రవారం నుంచి భూ సేకరణ పనులు చేపడుతామని అధికారులు పేర్కొన్నారు. అధికారుల వెంట వేంపల్లి ప్రాంత ప్రజలు వోలపు రమేశ్, తిరుపతి, బేర ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

**కొత్త ప్రతిపాదన ఇదీ..**

హాజీపూర్ మండలం ముల్కల్ల, గుడిపేట, నర్సింగాపూర్, రాపల్లి, హాజీపూర్, కర్ణమామిడి, పడ్తనపల్లి, దొనబండ మీదుగా లక్సెట్టిపేట మండలం మిట్టపల్లి, గుల్లకోట, పోతపల్లి, ఇటిక్యాల, లక్సెట్టిపేట, మోదెల ప్రాంతాల్లో గోదావరి తీరం వెంట గూడెం వరకు మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరిగేలా ప్రతిపాదించారు. గతంలో సిద్ధం చేసిన మూడు అలైన్‌మెంట్లలో ఖరారు చేసిన అలైన్‌మెంట్ ప్రకారం జిల్లాలో రాయపట్నం వంతెన నుంచి ప్రారంభమై దండేపల్లి మండలం గూడెం, కన్నెపల్లి గ్రామాల మీదుగా లక్సెట్టిపేట, ఊత్కూరు, అంకత్‌పల్లి, దొనబండ, హాజీపూర్ గ్రామాల మీదుగా ముల్కల్ల వరకు జాతీయ రహదారి–63 వెంబడి రహదారి విస్తరణ చేపట్టేలా సర్వే నిర్వహించారు. నూతనంగా ప్రతిపాదించిన మ్యాప్ మేరకు ప్రైవేట్, పట్టా భూములతోపాటు ఆలయాలు, గృహాలు, దుకాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లడం లేదు. ఇక క్యాతనపల్లి–గద్దెరాగడి నుంచి గూడెం వరకు 35 కిలోమీటర్ల మేర దాదాపు 158 హెక్టార్ల స్థలాన్ని నోటిఫైడ్ చేసే క్రమంలో ఇప్పటికే క్యాతనపల్లి నుంచి ముల్కల్ల పోచంపాడు శివారు వరకు దాదాపు 45 హెక్టార్ల భూమి నోటిఫైడ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఇంకా 113 హెక్టార్ల భూమిని నోటిఫై చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ పూర్తయితే మార్చి వరకు రోడ్డు పనులకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

# శిబిరానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

- ప్రత్యేక బస్సుల్లో తరలింపు
- కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల తర్జన భర్జన



రహస్య శిబిరంలో కౌన్సిలర్లు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీలో క్యాంపు రాజకీయాలకు తెరలేచింది. గురువారం తెల్లవారు జామున బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20మంది కౌన్సిలర్లు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక బస్సుల్లో రహస్య శిబిరానికి తరలి వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ పార్టీలకతీతంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర కౌన్సిలర్లు కలెక్టర్ సంతోష్‌కు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. ఈ నెల 12న మున్సిపల్ సమావేశం నిర్వహణకు సభ్యులకు సమాచారం అందించారు. సమావేశం సమయం సమీపిస్తుండడం, మరోవైపు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరికకు మొగ్గు చూపడంతో మెజార్టీ సభ్యుల బలం ఉన్న బీఆర్ఎస్ నాయకత్వం తమ సభ్యులను శిబిరానికి తరలించడంలో సఫలమైంది. కాగా, బీఆర్ఎస్ పార్టీకి వైస్‌చైర్మన్‌తో కలిపి 21 మంది సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌కు చైర్‌పర్సన్‌తో కలిపి 11మంది, బీజేపీ ఒకరు ఉండగా.. మరోస్థానం ఖాళీగా ఉంది.

**క్యాంపులో వీరే..**

బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లతో హైదరాబాద్ శివారు ప్రాంతంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో కౌన్సిలర్లు షేక్ అఫ్సర్, షేక్ ఆస్మా, సముద్రాల లావణ్య, జిలకర తార, కొక్కెర చంద్రశేఖర్, నెల్లి శ్రీలత, ఎలిగేటి సుజాత, గురుండ్ల లక్ష్మి, గోషిక రమేష్, రాజనాల కమల, గడ్డం అశోక్‌గౌడ్, దామెర శ్రీనివాస్, తుంగపల్లి సుజాత, పోతరాజుల లీల, తడక పద్మావతి, భరద్వాజ్ సుకేశిని, పోలు ఉమాదేవి, చిట్యాల లక్ష్మి ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు కౌన్సిలర్లు బొడ్డు నారాయణ, గెల్లి రాజలింగు ఒకట్రెండు రోజుల్లో శిబిరంలో చేరనున్నట్లు చెబుతున్నారు. మరో రాజకీయ పార్టీకి చెందిన కౌన్సిలర్ రేపో మాపో శిబిరంలో చేరే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**చెరో పార్టీలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్**

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన చైర్‌పర్సన్ శ్వేత ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరారు. వైస్ చైర్మన్ సుదర్శన్ బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. వీరిద్దరు చెరో పార్టీలో ఉండగా వీరిపై అవిశ్వాసం ప్రతిపాదించిన సభ్యుల్లో పార్టీల వారీగా చీలిక రావడం గమనార్హం. బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లగా.. కాంగ్రెస్ కౌన్సిలర్లు ఏం చేయాలనే యోచనలో తర్జన భర్జన పడుతున్నారు. అవిశ్వాసాన్ని ఎదుర్కొనే తీరుపై సమాలోచనలు చేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలనే తలంపులో ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసం విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, స్వతంత్ర కౌన్సిలర్లు ఏకాభిప్రాయంతో ఉండడం కొసమెరుపు.

# 'ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వినోద్

**బెల్లంపల్లిరూరల్:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం మండలంలోని చాకేపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ ముడి శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని మరో మూడు రోజులు కొనసాగించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో దరఖాస్తులు అందజేయాలని అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధే తన ఆశయమని తెలిపారు. అనంతరం మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ మహేందర్, ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాంచందర్, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్ షహబాజ్ అహ్మద్, నాయకులు స్వామి, మల్లేష్, స్వామి పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

**మంచిర్యాలటౌన్:** ప్రజలు ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం టొబాకో ఫ్రీ, మానసిక సమస్యలపై అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మానసికంగా దృఢంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఆశావహ దృక్పథంతో ఉండాలని అన్నారు. ఏ పనినైనా ప్రణాళికబద్ధంగా చేయడంతోపాటు వారి సామర్థ్యాలను తెలుసుకుని అందుకు తగినట్లుగా ముందుకు సాగాలని తెలిపారు. మానసిక సమస్యలు ఉన్నవారు 14416 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. జిల్లాలో పొగాకు రహిత ప్రాంతాలుగా మార్చేందుకు పొగాకు వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని అన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ పూర్ణిమ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్, సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, సీహెచ్‌వో లింగారెడ్డి, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

**పాతమంచిర్యాల:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని, 59 ఎస్సీ ఉప కులాల ఐక్యత కోసం కృషి చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షుడు తొగరి సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో మాల మహానాడు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే మాల మహానాడు రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలని కోరారు. జైభీం సైనిక్‌దళ్ రాష్ట్ర కో ఆర్డినేటర్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపాక సుధీర్, పాల్తెపు శంకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్ పాల్గొన్నారు.

# అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



మద్దిమాడలో దరఖాస్తుల పరిశీలన

**కాసిపేట:** అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఐదు గ్యారంటీల పథకాల ఫలాలు అందిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. గురువారం మండలంలోని మద్దిమాడలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మహలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి గంగారాం, ఎంపీడీవో ఎంఏ అలీం, సర్పంచ్ ఆడ జంగు, అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం ఇంద్రానగర్‌కు చెందిన గద్దల వెంకటేశ్ (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిస కావడంతో అనారోగ్యానికి గురయ్యాడు. అతని భార్య లక్ష్మి ఇటీవల క్రిస్మస్ వేడుకలకు కన్నెపల్లి మండలం మెట్‌పల్లిలో ఉన్న పుట్టింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితమే అనారోగ్యంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి గురువారం డిశ్చార్జి కావడంతో ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రైలు పట్టాల వద్దకు వెళ్లి గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నాగయ్య మృతదేహం

జైపూర్: మండలంలోని ఇందారం క్రాస్‌రోడ్డు సమీపంలో జనవరి 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంచిర్యాలకు చెందిన గంట నాగయ్య (55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంచిర్యాలలోని రెడ్డి కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగయ్య ఈ నెల 1న షెట్‌పల్లికి వచ్చి మంచిర్యాలకు వెళ్తుండగా ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేసేక్రమంలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### 'కార్మికులకు సర్వీస్ ప్రమోషన్లు ఇవ్వాలి'

శ్రీరాంపూర్: కార్మికులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్స్(ఎస్ఎల్పీ) వెంటనే ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి ఉపాధ్యక్షులు కొట్టె కిషన్‌రావు, కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకే కేటగిరీలో భూగర్భంలో ఏడేళ్లు, సర్ఫేస్‌లో ఎనిమిదేళ్లు పనిచేస్తే వారికి జనవరి 1న ఎస్ఎల్పీ ప్రమోషన్లు అందజేయాల్సి ఉందన్నారు. గతేడాది జనవరి1న అప్పటి గుర్తింపు సంఘం నాయకులతో హంగామా చేయించి కార్మికులకు లెటర్లు ఇచ్చిన యాజమాన్యం ఇప్పుడు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితుడితో పోలీసులు

మంచిర్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఒక యువకుని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన పత్తం అభిరామ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి రైలుమార్గం ద్వారా గంజాయి తీసుకువస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు గురువారం రైల్వే స్టేషన్‌లో సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 68 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# మరో 12 రోజులు ముల్కల్లలోనే..

- లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూముల్లో ఎన్నికల సామగ్రి
- ఐదేళ్ల వరకు ఈవీఎంలు భద్రంగా ఉంచాల్సిందే..
- 45 రోజుల అనంతరం ఐడీఓసీలోని గోదాములోకి..



హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాల లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసినా హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రంలో ఎన్నికల సామగ్రి ఇంకా భద్రంగా ఉన్నాయి. ఓట్ల లెక్కింపు ముగిసిన వెంటనే ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, వీవీ ప్యాట్లలోని స్లిప్పులు, మాక్ పోల్ ధ్రువ ప్రతాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి తాళాలు వేసి సీజ్ చేశారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి అంతా బందోబస్తులో భద్రపరచి ఉంచారు. లెక్కింపు కేంద్రంలో 45 రోజుల పాటు ఎన్నికల సామగ్రి భద్రపర్చాల్సి ఉండగా మరో 12 రోజులు (ఈ నెల 17 వరకు) ముల్కల్లలోనే ఉంచనున్నారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని స్ట్రాంగ్‌రూం గోదాములోకి వీటిని మారుస్తారు.

**స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట నిఘా..**

హాజీపూర్ మండల ముల్కల్లలోని ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రంలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం, తదితర ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. భద్రతా సిబ్బంది విడతల వారీగా 24 గంటల పాటు నిఘా కళ్లతో పర్యవేక్షిస్తున్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్లతో పాటు ఎన్నికల సామగ్రిని ఎన్నికల సంఘానికి అప్పగించే వరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

**ఫిర్యాదుతో తక్షణ పరిష్కారం దిశగా..**

ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత గెలిచిన అభ్యర్థిపై ఓడిపోయిన అభ్యర్థి ఫిర్యాదు చేసే అవకాశాలు కూడా ఉంటాయి. ఓట్ల లెక్కింపు సమయంలో అవకతవకలు జరిగాయని సదరు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో అభ్యర్థులకు న్యాయం చేయడానికి ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను మళ్లీ లెక్కించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. ఈ క్రమంలోనే ఏ నియోజకవర్గం నుంచి అయినా ఫిర్యాదు వస్తే దానికి సంబంధించిన కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను తక్షణమే లెక్కించడానికిగానూ ముందస్తుగా అధికారులు ఈ ఈవీఎంలను భద్రపరుస్తారు. అయితే మంచిర్యాల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వడంతో ఫలితాలపై కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తవని పరిశీలకులు స్పష్టంగా పేర్కొంటున్నారు. అయినా భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు లెక్కింపు కేంద్రంలో భద్రపరిచి ఉంచారు.

**45 రోజుల తర్వాత..**

ఎన్నికల ఫలితాలు వెల్లడించిన 45 రోజుల పాటు జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కల్పిస్తారు. అనంతరమే ఎన్నికల సామగ్రిని ఎన్నికల సంఘానికి అప్పగించి గోదాములకు చేర్చి అక్కడ వాటిని ఐదేళ్ల పాటు భద్రపరుస్తారు. ఆపై ఎన్నికల సంఘంచే నియమించబడిన సాంకేతిక సిబ్బంది వచ్చి ఈవీఎం, వీవీ ప్యాట్లలో ఉన్న డేటాను మొత్తం తొలగిస్తారు. ఆపై దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ ఎన్నికల సామగ్రిని తరలించి అక్కడ జరిగే ఎన్నికలకు వినియోగిస్తారు.

### జాతీయస్థాయి పోటీలకు రెఫరీలుగా ఎంపిక


కే.మల్లేశ్


ఆర్.రామకృష్ణ


ఆర్.శ్రీనివాస్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ నెల 6 నుంచి 10 వరకు జరగనున్న 69వ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రెఫరీలుగా గోలేటికి చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ తెలిపారు. కుమ్మరి మల్లేశ్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.రామకృష్ణ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ నాయకులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## ఏరియా ఆస్పత్రిలో బదిలీలు ఆపాలి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో కార్మికుల బదిలీలు ఆపాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఐఎన్టీయూసీ నాయకులు, ఆస్పత్రి కార్మికులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల కుదింపు, స్పెషలిస్టు వైద్యుల నియామకాలు లేకపోవడం, రోగుల ఇబ్బందులు వివరించారు. ఆస్పత్రి మూసివేతకు యాజమాన్యం యత్నిస్తోందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సింగరేణి సీఅండ్ ఎండీ బలరాం నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బెల్లంపల్లిలో పదివేల మంది కార్మిక కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, కార్మికులకు వైద్య సేవలు అందించాల్సింది పోయి ఆస్పత్రిని నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, సోకాల శ్రీనివాస్, కుక్కల ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణీయులకు అందుబాటులో సీఎండీ


సీఎండీ బలరాంతో కార్మికుడు సురేష్


బలరాంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ పా) ఎన్.బలరాం సింగరేణీయులకు అందుబాటులో ఉంటున్నారని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి ఏరియాలోని కేకే–5గనిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు మంగళంపల్లి సురేష్ గురువారం హైదరాబాద్‌లో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సీఎండీగా బాధ్యతలు నిర్వహించిన శ్రీధర్‌ను అధికారులు కలవాలంటేనే ఎంతో శ్రమపడాల్సి వచ్చేదని, సాధారణ కార్మికుడు కూడా ప్రస్తుత సీఎండీని కలిసే అవకాశం కల్పించడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సుమారు తొమ్మిదేళ్లుగా సీఎండీగా ఎన్.శ్రీధర్ విధులు నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను తొలగించి జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని సూచించింది. సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ పా) బాధ్యతలు నిర్వర్తిస్తున్న బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏది ఏమైనా సింగరేణి సంస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వెలికితీసి సంస్థకు రావాల్సిన బకాయిలు వసూలు చేయాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

**సీఎండీని కలిసిన ఎస్సీ, ఎస్టీ నాయకులు**

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాంను సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో అసోసియేషన్ సెంట్రల్ ఉపాధ్యక్షుడు వంగూరు కెనడి, ఏరియా ఉపాధ్యక్షుడు నిలబోయిన కుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాజేంద్రప్రసాద్, చెన్నూరి శ్రీనివాస్, చెరుపల్లి సురేష్, చిన్ని ప్రశాంత్, అశోక్ పాల్గొన్నారు.

## నాగోబా జాతరకు సన్నద్ధం

- ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర
- 12న నాగోబా దర్బార్
- ఏర్పాట్లపై కలెక్టర్, ఐటీడీఏ పీవో సమీక్ష
- భక్తులకు ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేయాలని సూచన
- జాతరకు మంత్రులు వచ్చే అవకాశం ఉందన్న రాహుల్‌రాజ్


నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలో పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో


నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్, పీవో

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదివాసీల ఆరాధ్యదైవం, పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఫిబ్రవరి 9న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభం కానుంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతంలో మెస్రం వంశీయులు బస చేసే గోవడ్ స్థలం, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**30లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి**

అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆయా శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. గతేడాది శాఖల వారీగా చేసిన ఏర్పాట్ల వివరాలు పరిశీలించారు. ఈ ఏడాది చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రణాళిక తయారుచేసి నివేదిక అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9 నుంచి 15 వరకు జాతర కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా 12న నాగోబా దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వివిధ శాఖల మంత్రులు రానున్నట్లు తెలిపారు. శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేయడంతో పాటు గోవడ్ వద్ద, మర్రిచెట్టు, పోలీస్ క్యాంపు, జాతర నిర్వహణ స్థలాల్లో తాత్కాలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయించాలన్నారు. ముత్నూర్ నుండి కేస్లాపూర్ వరకు, మెండపల్లి నుండి నాగోబా ఆలయం వరకు, హర్కపూర్ చౌక్ నుండి కేస్లాపూర్ వరకు రోడ్లకు మరమ్మతు చేయాలన్నారు. ఈ పనులన్నీ ఈనెల 30 లోగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకం అమలులో ఉన్నందువల్ల ఈసారి జాతరకు మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలన్నారు.

**సమన్వయంతో పనిచేయాలి**

ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పగించిన బాధ్యతలను గడువులోగా పూర్తి చేసి జాతర విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఆదివాసీ నాయకుడు ఆర్క ఖమ్ము మాట్లాడుతూ గత జాతరలో దొంగతనాలు, మట్కా జూదం వంటి సంఘటనలు జరిగాయని, ఈసారి అలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్, పీవోను కోరారు. జాతరలో దుకాణలు ఏర్పాటు చేస్తున్న ప్లాట్ల ధర ఏటా పెంచుతుండడంతో వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారన్నారు. దీనిపై కూడా ఆలోచించాలన్నారు. జాతరలో వచ్చే ఆదాయం, ఖర్చులను సామాన్య ప్రజలకు తెలిసేలా సూచిక బోర్డులో నమోదు చేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఈసారి పోలీసు బందోబస్తు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రామకృష్ణ, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, సర్పంచ్ మెస్రం రేణుక నాగ్‌నాథ్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం, మెస్రం వంశ ఉద్యోగులు మనోహర్, సోనేరావ్, శేఖర్‌బాబు, దేవ్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

## 'కార్మికులకు అండగా ఉంటాం'


మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: గుర్తింపు ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా కార్మికులకు అండగా ఉంటామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. గురువారం ఆర్కే 7గనిపై కార్మికులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. శ్రీరాంపూర్‌లో తాము ఓడిపోయినా మిగిలిన ఆరు ఏరియాల్లో గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మికులకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉండి పోరాడుతామన్నారు. సింగరేణి నిధులను సింగరేణి ప్రాంతంలోనే ఖర్చు చేయాలని కోరారు. సింగరేణి ప్రాంతంలో అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ముఖ్యమంత్రిని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, నాయకులు గరిగె స్వామి, శ్రీనివాస్, శ్రీకాంత్, జే.నర్సింగ్, భీం రవి, సదానందం, వెంకటేష్, రాకేశ్‌రెడ్డి, జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ బలరాం

జైపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ 2024ను గురువారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్లు డి.సత్యనారాయణ, ఎన్‌వీకె.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.బలరాంకు సంఘం చీఫ్ లైసన్ ఆఫీసర్ కృష్ణయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పంతుల, వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ శుభాకాంక్షలు తెలిపారు.

### మతసామరస్యానికి ప్రతీక

- అయ్యప్పస్వాములకు భిక్ష పెట్టిన ముస్లిం


భోజనం వడ్డిస్తున్న మహ్మద్ నిజామొద్దీన్

జన్నారం: మండల కేంద్రంలోని అయ్యప్ప భక్తులకు ముస్లిం సోదరుడు భిక్ష అందించి మతసామరస్యాన్ని చాటుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి మహ్మద్ నిజామొద్దీన్, మహిళా నాయకురాలు గీత ఆధ్వర్యంలో రాంపూర్, తాళ్ళపేట, మామిడిపల్లి, దండేపల్లి గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప నామస్మరణతో వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గడ్డం శ్రీనివాస్, త్రిమూర్తి స్వాములు పాల్గొన్నారు.

## 'ఉద్యమకారులను విస్మరించిన బీఆర్ఎస్'


దరఖాస్తు అందిస్తున్న కో ఆర్డినేటర్ రవీందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ ఉద్యమకారులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దుర్గం రవీందర్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రెబ్బెన మండలం గోలేటి పంచాయతీలో గురువారం సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు అందించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న యువకులు, విద్యార్థులపై అప్పటి పాలకులు అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపించారన్నారు. ఎంతో మంది యువకుల జీవితాలు నాశనం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఉద్యమకారుల అంశాన్ని చేర్చడాన్ని ఉద్యమకారుల ఫోరం స్వాగతిస్తోందని పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

## సాహస కృత్యానికి దక్కిన గౌరవం

- 'భీష్మ వశిష్ట' అవార్డుకు ఎంపికైన కార్తీక్


తల్లిదండ్రులతో కార్తీక్

కెరమెరి(ఆసిఫాబాద్): సాహసకృత్యాల్లో ఎన్నో పతకాలు సాధించి జిల్లాకే పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన మండలంలోని కెలికే గ్రామానికి చెందిన గిత్తే కార్తీక్ 'భీష్మ వశిష్ట పురస్కార్' అవార్డుకు ఎంపికయ్యాడు. వందేభారత్ ఆర్గనైజేషన్ కమిటీ ఆర్గనైజర్ వరప్రసాద్ ద్వారా ఆహ్వానం అందింది. ఈ నెల 6న వైజాగ్‌లోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. కెరమెరి మండలం కెలికే గ్రామానికి చెందిన గిత్తే రుక్మాజీ, ఇటాబాయి దంపతుల కుమారుడు కార్తీక్ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని మైనార్టీ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. 2023 అక్టోబర్‌లో సిక్కిం రాష్ట్రంలోని చంచోయ్ భీకర అడవుల్లో 15 కిలోల బ్యాగుతో పీఈటీ, రన్నింగ్, ట్రెక్కింగ్‌లో శిక్షణ తీసుకున్నాడు. అదే అడవుల్లో 10 డౌన్ హిల్ అనే ప్రాంతంలో 9,600 అడుగుల ఎత్తులో 20 కిలో మీటర్ల దూరం వరకు ట్రాయల్ టెక్ చేశాడు. 11 వేల అడుగుల ఎత్తులో ఉన్న అక్లొమడైజేషన్‌లో ట్రెక్ చేశాడు. 14 వేల అడుగుల ఎత్తు 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇంథామ్‌వెల్లి నుంచి ట్రాంజెష్ట క్యాంప్–1లో ట్రెక్కింగ్ చేశాడు. 5,300 అడుగుల ఎత్తులో ఉన్న మంచుకొండలను అధిరోహించి తిరంగా జెండాను ఎగురవేశాడు. ఈ సందర్భంగా వందేభారత్ ఆర్గనైజేషన్ వారు కార్తీక్‌ను అవార్డుకు ఎంపిక చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతు సతీష్

చెన్నూర్‌రూరల్: నాబార్డు ఆర్థిక సహాయంతో వాతావరణ నిర్ధారణ పథకంలో భాగంగా కుమురంభీం జిల్లా రింగన్‌గూడ గ్రామానికి చెందిన రైతులు చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు గోనే సతీష్ ఆ రైతులకు శిక్షణ ఇచ్చారు. కంపోస్టు ఎరువుల తయారీ, ద్రవ, ఘన జీవామృతాల తయారీపై తెలియజేశారు. తాను సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న పంటలపై వివరించారు. పంటలకు సేంద్రీయ ఎరువులను ఏ మోతాదులో ఏ పంటకు వాడాలో తెలియజేశారు. అనంతరం శిక్షణ పత్రాలను రైతులకు అందజేశారు.

## తక్కువ ధరకే నాణ్యమైన సన్నబియ్యం

- ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా విక్రయం


జిల్లా కేంద్రంలోని గోదావరి ఎఫ్‌పీవో రైస్ స్టోర్

పాతమంచిర్యాల: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా మార్కెట్ కంటే తక్కువ ధరలకే కల్తీలేని సన్నబియ్యం విక్రయ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన జైశ్రీరాం రకం వరి ధాన్యం మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు రూ.5,800కు విక్రయిస్తున్నారు. జిల్లాలోని జైపూర్, భీమారం మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు 2018–19లో మహిళా ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు చేసుకున్నారు. సంఘం ద్వారా రైతులకు ఎరువులు విక్రయిస్తున్నారు. పంటల సీజన్‌లో రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో వెయ్యి క్వింటాళ్ల బియ్యం విక్రయించాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో గోదావరి ఎఫ్‌పీవో రైస్ స్టోర్స్ పేరుతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా డిసెంబర్ 30న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు.